క్లుప్తంగా

బాధితురాలికి రూ.20 వేల సాయం



బాధితురాలికి సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యానికి గురైన బాధితురాలికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు బుధవారం రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన సయ్యద్ ఖాదర్నిశ బేగం శరీరంపై కాయ రావడంతో హాస్పిటల్లో చూపించగా, ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. పేదరికంలో వీరి ఆర్థిక పరి స్థితి అంతంత మాత్రం కావడంతో శస్త్రచికిత్స కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థను సహాయం కోరారు. దీంతో వారు రూ.20 వేల నగదును ఆమెకు అందజేశారు.

ఉపాధి ఇన్‌చార్జి ఏపీఓగా లక్ష్మీనారాయణ



పి.గన్నవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పి.గన్నవరం ఇన్‌చార్జి ఏపీఓగా సీహెచ్ లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఇంతవరకూ ఇక్కడ ఏపీఓగా పనిచేసిన బొంతు చంద్రమోహన్ అంబాజీపేట మండలానికి బదిలీపై వెళ్లారు.

వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వెంకన్న ఆలయంలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన పోలిరెడ్డి వెంకట సత్యనారాయణ–వెంకట నాగమణి దంపతులు రూ.45,999 విరాళం అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి నిత్యాన్నదానం ట్రస్టుకు శెట్టిపల్లి పుష్పావతి స్మారకార్థం ఆమె భర్త శెట్టిపల్లి సూర్యనారాయణ (కాకినాడ) బుధవారం రూ.50,116 విరాళంగా అందించారు.

కల్యాణం.. కమనీయం..

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి కల్యాణోత్సవం బుధవారం మామిడికుదురులో రమణీయంగా జరిగింది. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా శివాలయం ప్రాంగణంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పర్యవేక్షణలో కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, ఎంపీటీసీలు, స్థానిక పెద్దలు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐఎస్‌కేఓ, ఐఎస్‌సీఓ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజోలు: ఐఎస్‌కేఓ, ఐఎస్‌సీఓ ప్రతిభా పరీక్షల్లో శివకోడు నారాయణ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. బుధవారం ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథం ఆధ్వర్యంలో విద్యార్థులను అభినందించారు. ఐఎస్‌కేఓ, ఐఎస్‌సీఓ పరీక్షల్లో యెరుబండి కార్తికేయన్, హాసినా, స్టీవెన్ విల్, అవినాష్, దివ్యశ్రీ, జయపాల్, మౌళిలు ప్రతిభ చూపారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ తోరం దుర్గాప్రసాద్, అకడమిక్ డీన్ రాంబాబు, శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

నేనోతో అధిక దిగుబడులు

అంబాజీపేట: వరి పంటల్లో అధిక దిగుబడులకు నేనో యూరియా, నేనో డీఏపీలను వినియోగించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఇఫ్కో అగ్రాల్‌మిస్ట్ అక్కల శివరామకృష్ణ అన్నారు. ముక్కామల, అంబాజీపేట సొసైటీల వద్ద నేనో యూరియా, డీఏపీల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందుల విక్రయాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి పొందిందని, ఈ నేనో వినియోగించడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ డెమానిస్ట్రేటర్ మట్టపర్తి వరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చూసి జగన్‌కు అండగా నిలవండి

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- జోరుగా వై ఏపీ నీడ్స్ జగన్

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూడండి, ప్రభుత్వానికి అండగా నిలవండి అంటూ రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. కరవాకలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించిన ఆర్థిక సాయానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జగన్ సారథ్యంలో అమలు చేస్తున్న పథకాలను ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలను పట్టించుకుంటే భవిష్యత్ అంధకారంగా మారుతుందని వరప్రసాదరావు పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నేతలు రేకాడి చంద్రశేఖర్, రాపాక శ్రీనుబాబు, నేల పెద్దిరాజు, కుసుమ శ్రీధర్, బొలిశెట్టి భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



కరవాకలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మేడిచర్లపాలెంలో..

మలికిపురం: సీఎం జగన్‌తోనే సుపరిపాలన సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. మలికిపురం మండలం మేడిచర్లపాలెంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల కుటిల యత్నాలను ప్రజలు తిప్పి కొట్టాలని అన్నారు. సచివాలయ మండల కన్వీనర్ చింత రాజబాబు, సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి, గ్రామ శాఖ నాయకులు కానూరి బాబి, సచివాలయ సిబ్బంది, వలంటీర్స్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పల్లిపాలెంలో..

సఖినేటిపల్లి: పల్లిపాలెంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే డోర్ టూ డోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్, ఎంపీపీ వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, సర్పంచ్‌లు ఒడుగు శ్రీను తదితరులు ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, విజయాలను తెలియజేశారు. అలాగే 2014లో చంద్రబాబు, 2019లో జగనన్న చేసిన వాగ్దానాలు నెరవేర్చినవి, నెరవేరకపోయినట్టయితే వాటిపై టిక్‌లు నిర్ణయించారు. వీటితో పాటు ఏపీకి జగన్ ఎందుకు అవసరం బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జి.పెదపూడిలో..

పి.గన్నవరం: జి.పెదపూడిలో వైఎస్సార్ సీపీ జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు ఆధ్వర్యంలో బుధవారం ఏపీకి సీఎం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్‌కి ప్రజలంతా మద్దతు తెలపాలని కోరారు. సర్పంచ్ దంగేటి అన్నవరం, పార్టీ నాయకులు కుప్పాల నాగేశ్వరరావు, మానుకొండ నిర్మల, నూకపెయ్యి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బెల్లంపూడిలో సర్పంచ్ బండి మహాలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, యర్రంశెట్టివారిపాలెంలో గ్రామశాఖ అధ్యక్షుడు అప్పన త్రినాథస్వామి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని పార్టీ మండల అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అన్నారు. అంతకుముందు సచివాలయంలో సంక్షేమ పథకాల అమలు తీరును వివరించి డిస్‌ప్లే బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వాసర్ల మరిడి ఇంటి వద్ద పథకాల అమలు తీరును ప్రజలకు వివరించి చర్చించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, చింతపల్లి వెంకటేశ్వరరావు, బీర రావులు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలంకలో..

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంక సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.14 కోట్లు గ్రామ ప్రజలకు లబ్ధి చేకూరిందని పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ వివరించారు. గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దాసరి శైలజ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొంతు రాజేంద్రప్రసాద్, గ్రామశాఖ అధ్యక్షులు దాసరి శ్రీను, సచివాలయ కన్వీనర్ గోడి హేమలత తదితరులు ఉన్నారు.



మేడిచర్లపాలెంలో ప్రభుత్వ పథకాల అమలు కిట్ అందిస్తున్న బ్రహ్మాజీరావు



పల్లిపాలెంలో డోర్ టూ డోర్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్న నాయకులు



జి.పెదపూడిలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న పార్టీ నాయకులు



కె.పెదపూడిలో పార్టీ పథకాలను వివరిస్తున్న నాయకుడు చినబాబు

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా సంక్షేమ పథకాలు

సఖినేటిపల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు సంక్షేమాన్ని అందించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం రామేశ్వరంలో ఎమ్మెల్యే రాపాక, తనయుడు రాపాక వెంకట్‌రామ్‌తో కలసి అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం ప్రజలకు అందిన దాఖలాలు లేవన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో పేదల అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆయా వర్గాల ఆర్థిక సాధికారత కోసం సీఎం జగన్ ఎన్నో చర్యలు తీసుకున్నారన్నారు. సర్పంచ్ కట్టా ఉమా మహేశ్వరరావు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, ఎంపీటీసీలు దొండపాటి సునీత, కె.శుభాకర్, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు బళ్ళ లక్ష్మణ్, నాయకులు దొమ్మేటి ఉమా మహేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు. అలాగే అంతర్వేది దేవస్థానం గ్రామంలో నూతనంగా నిర్మించిన సమిష్టి వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, సంఘ ప్రెసిడెంట్ తాడి ఝాన్సీలక్ష్మి, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ బైర నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, స్థానికులు పాల్గొన్నారు.



రామేశ్వరంలో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

వైద్య సేవలను మరింత విస్తృతం చేయాలి

ఆలమూరు: పీహెచ్‌సీల ద్వారా మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను అందించడంతో పాటు ప్రసవాల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర అన్నారు. మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్షలో గుర్తించిన రోగులకు అందిస్తున్న చికిత్స విధానంపై ప్రగతిపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను నివారించే ధ్యేయంగా వైద్యారోగ్య సిబ్బంది సేవలను విస్తృతం చేయాలన్నారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు, సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ తదితరులు పాల్గొన్నారు.



పెదపళ్లలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర

పర్యావరణంపై అవగాహన

మలికిపురం: సఖినేటిపల్లి లంక హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయిని, ఏపీ ఎన్జీసీ కోఆర్డినేటర్ గుండేపల్లి ప్రభావతి ఆధ్వర్యంలో మలికిపురంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. సభలో ప్రతి ఒక్కరూ మన చుట్టూ ఉన్న పరిసరాలపై అవగాహన కలిగి ఉండాలని, మొక్కల పెంపకానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యార్థులు వారి పుట్టిన రోజుకు మొక్కలను కానుకగా తేవాలని ఆమె చెప్పారు. అనంతరం పాఠశాల ఆవరణలో బాదం, వేప, జామ లాంటి మొక్కలను నాటారు. జీవవైవిధ్యంలో భాగంగా బాదం మొక్కలు నాటినట్లైతే వాటి ద్వారా ఆ పక్షుల ఆవాసాన్ని పొందటమే కాకుండా ఆహారాన్ని కూడా సేకరించుకోగలుగుతాయని తెలియజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం–ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అంటూ విద్యార్థులతో నినాదాలు చేయించారు. కార్యక్రమంలో పీవీవీ వరప్రసాద్, డిగ్రీ కాలేజీ అధ్యాపకులు, పాఠశాల హెచ్‌ఎం స్వరూపరాణి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

మామిడికుదురు: ఆదుర్రులోని సర్వమంగళ పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. విశ్వేశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన చేశారు. లక్ష మారేడు దళాలతో అర్చన చేశారు. పలువురు భక్తులు లక్ష బిల్వార్చనలో కర్తలుగా పాల్గొన్నారు. పూజ్యం వెంకటేశ్వరశర్మ, పూజ్యం జగన్నాథశర్మ బ్రహ్మత్వంలో ఈ పూజలు జరిగాయి.



ఆదుర్రు లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు

అంబాజీపేటలో..

అంబాజీపేట: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని అంబాజీపేట మండలంలో శివుని ఆలయంలో ప్రత్యేక బుధవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మాచవరం రాజరాజేశ్వరి ఆలయం, పార్వతీ సమేత కందుల మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామి వారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. అలాగే మండలంలోని వ్యాఘ్రేశ్వర స్వామి, మాచవరం, గంగలకుర్రు అగ్రహారం తదితర గ్రామాల్లో శివునికి లక్షపత్రి పూజలు చేశారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం: గ్రామం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. ఆత్రేయపురం గ్రామానికి చెందిన మణికంఠ స్వామి సాగిరాజు సూర్యతేజ కార్యక్రమాలను సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. ఉదయం గణపతి హోమం, పేటతుళ్లి, కలశ పూజ, పడిపూజ తదితర పూజల్లో అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాటు చేసిన ఈ పూజా కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములతో పాటు వివిధ గ్రామాల్లో పలువురికి భిక్ష, వడి ఏర్పాటు చేశారు. శబరిమల ఆలయం మాదిరిగా అరటిదొప్పలు, పూలు, పండ్లతో వెదురు బద్దలతో నిర్మించిన 18 మెట్లు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. వేదపండితుల ఆధ్వర్యంలో కనులపండువగా మండపంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతి హోమం తదితర పూజలు ఘనంగా జరిగాయి.



ఆత్రేయపురంలో పేటతుళ్లి నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

అర్జీదారుల వినతులను పరిష్కరిస్తాం

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులను ప్రజల ముంగిటకే తీసుకువచ్చి క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లోని ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో బుధవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ప్రజలకు నిర్ణీత గడువులోగా నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించే ఉద్దేశంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం వారానికి రెండు రోజులు మండల స్థాయిలో నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాస్థాయి అధికారులు తమ లాగిన్‌కు వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారించి అర్జీదారు సంతృప్తి చెందే విధంగా పరిష్కార మార్గాలు చూపేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం కోసం ప్రత్యేకంగా 1902 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశారన్నారు. అర్జీదారుడు ఇచ్చే ప్రతి వినతి పరిష్కారమయ్యే వరకూ ట్రాకింగ్ చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేస్తారన్నారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను పొందడంలో ఎలాంటి సమస్యలున్నా ఆయా ప్రభుత్వ శాఖలకు పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.



ఆలమూరులో ప్రజల నుంచి ఎమ్మెల్యే జగ్గిరెడ్డితో కలసి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

మండలంలోని వివిధ గ్రామాల్లోని అర్జీదారుల నుంచి వచ్చిన 92 వినతులను జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్, కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి స్వీకరించారు.

216 ఏ జాతీయ రహదారిలోని చెముడులంక వద్ద గతంలో మూసివేసిన డివైడర్‌ను ఓపెన్ చేయాలని ఆ గ్రామ సర్పంచ్ కన్వీనర్ తమ్మన శ్రీనివాసు కోరారు. సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ వి.కృష్ణకుమారి డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకట్రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసు బాబు, జిల్లా డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావుదొర, తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీవో కె.జాన్‌లింకన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. మండలంలోని పెదపళ్లలో ఆర్బీకేలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. రైతులెవరూ దళారీలను ఆశ్రయించి మోసపోవద్దని ఆయన స్పష్టం చేశారు. విత్తనం నుంచి విక్రయం వరకు అన్ని సౌలభ్యాలను ఆర్‌బీకేల్లో రైతులకు దగ్గరగా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. రైతాంగం తాము పండించిన ధాన్యం ఉత్పత్తులు తేమ శాతం 17 ఉండేటట్లు ఆరబెట్టుకుని నమూనా ధాన్యాన్ని దగ్గరలోని ఆర్బీకేల సాంకేతిక సహాయకులకు అందించి ధాన్యం నాణ్యత పరీక్షలను నిర్వహించుకోవాలని సూచించారు. నాణ్యత పరీక్షలను నిర్ధారించిన తర్వాత ధాన్యం బట్వాడాకు గోనె సంచుల సరఫరా చేసి రవాణా కోసం ట్రక్ జనరేషన్ చేస్తారన్నారు. ధాన్యం కొనుగోలు విషయమై రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్న సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. ఆర్డీవో ఎం.ముక్కంటి, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు, ఏవో లక్ష్మీ లావణ్య, రవాణా శాఖ అధికారి అశోక్ ప్రతాపరావు, తహసీల్దార్ ఐపీ శెట్టి తదితరులు పాల్గొన్నారు.



పెదపళ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

గడప గడపకూ నిధులతో గ్రామాభివృద్ధి

రాజోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరు చేసిన నిధులతో గ్రామాభివృద్ధి జరుగుతుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం కూనవరంలో గడప గడపకూ నిధులు రూ.13 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక గ్రామంలో కమ్యూనిటీ హాలు భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో గడప గడపకూ తిరిగిన సమయంలో గుర్తించిన అత్యవసర పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాస్, పార్టీ నాయకులు గుబ్బల మనోహర్, అప్పారి శ్రీనివాస్, చెల్లింగి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రిలో రికార్డుల పరిశీలన

ఆలమూరు: మండలంలోని పినపళ్ల పశువుల ఆస్పత్రిలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి కె.వెంకట్రావు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి పశువులకు అందిస్తున్న సేవలు, అమలు చేస్తున్న పథకాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పశువుల మందులకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ కొరత లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి పరిశుభ్రతపై ఆయన స్థానిక వైద్యాధికారి శ్రీనివాస్‌ను జిల్లా అధికారి ప్రత్యేకంగా అభినందించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.అనిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

అయినవిల్లి: గ్రామాల్లోని అభివృద్ధి పనులకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం కె.జగన్నాథపురంలో రూ.10 లక్షలతో గడపగడపకూ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. అలాగే కె.జగన్నాపురం పాఠశాలలో గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన వంట సామగ్రిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా అందజేశారు.

సామాజిక సాధికార యాత్రకు తరలిరండి

కొత్తపేట: నియోజకవర్గంలో గురువారం జరిగే వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రలో దళితులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన నియోజకవర్గంలోని దళితవాడల్లో పర్యటించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా న్యాయం చేసిన సీఎం జగన్‌కి మద్దతుగా జరుగుతున్న ఈ యాత్రలో లబ్ధి పొందిన దళితులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఖండ్రిగలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ఎస్ నేత కిషోర్ మాదిగ

సామాజిక సాధికార యాత్ర సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

రావులపాలెం: కొత్తపేటలో గురువారం జరిగే 'సామాజిక సాధికార బస్సు యాత్ర' సందర్భంగా బహిరంగ సభ జరుగుతున్న కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్టు రావులపాలెం ఎస్సై ఎం.వెంకటరమణ బుధవారం తెలిపారు. కొత్తపేట మీదుగా వెళ్లే వాహనాలు ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు ఈ కింది విధంగా మళ్లించినట్టు తెలిపారు. అమలాపురం, ముక్కామల, అవిడి నుంచి కొత్తపేట మీదుగా రావులపాలెం వెళ్లే వాహనాలు పలివెల నుంచి వెదిరేశ్వరం కాలువ గట్టు మీదుగా, గంటి చెక్ పోస్ట్, ఈతకోట మీదుగా రావులపాలేనికి మళ్లించామన్నారు. రావులపాలెం నుంచి అమలాపురం వైపు వెళ్లే వాహనాలను కొత్తపేట బోడిపాలెం బ్రిడ్జ్ దగ్గర నుంచి వాడపాలెం, వానపల్లి, ముక్తేశ్వరం మీదుగా అమలాపురానికి, అలాగే రావులపాలెం నుంచి సామాజిక సాధికార బస్సు యాత్ర కూడా వచ్చే టూ వీలర్స్, ఆటోలు, కార్లు బోడిపాలెం వంతెన దాటిన తరవాత కౌశిక రోడ్డు మీదుగా టూ వీలర్స్ అన్నీ వీకేవీ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లోకి, ఆటోలు, కార్లు అన్నీ కూడా హైస్కూల్ గ్రౌండ్‌లోకి పార్కింగ్ చేసుకుని, కొత్తపేట మెయిన్ రోడ్డులోని మీటింగ్ ప్లేస్‌కి రావాల్సిందిగా సూచించామన్నారు. వాహనదారులు అందరూ పై సూచనలు గమనించి పోలీసు వారికి సహకరించవలసిందిగా ఎస్సై విజ్ఞప్తి చేశారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

ఆత్రేయపురం: నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ బుధవారం కొత్తపేటలో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు పిలుపునిచ్చారు. ఆత్రేయపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పేద వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పరిపాలన సాగించారని ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి నాయకత్వంలో రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్ నుంచి కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల వరకూ సాగే బస్సుయాత్రకు ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి యాత్రను విజయవంతం చేయాలని కోరారు.